సాక్షి పెద్దపల్లి

ఆదివారం, 15, అక్టోబర్, 2023

భారత్ గెలుపుపై సంబురాలు

పాకిస్తాన్, భారత్ జట్ల మధ్య శనివారం జరిగిన వన్డే క్రికెట్ మ్యాచ్‌లో భారత జట్టు విజయం సాధించడంపై జిల్లావ్యాప్తంగా సంబురాలు అంబరాన్నంటాయి. క్రికెట్ అభిమానులు టపాసులు పేల్చి, మిఠాయిలు పంచిపెట్టి సంబురాలు చేసుకున్నారు. గోదావరిఖని, పెద్దపల్లి, సుల్తానాబాద్ తదితర ప్రాంతాల్లో వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



న్యూస్‌రీల్

బొడ్డెమ్మ నోము వేడుకలు



పూజలు చేస్తున్న ఆర్యవైశ్య మహిళలు

ఎలిగేడు(పెద్దపల్లి): ఆర్యవైశ్య సంఘం మహిళలు శనివారం మండల కేంద్రంలో బొడ్డెమ్మ నోము వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొమ్మిదిరోజులపాటు బొడ్డెమ్మను పూజించారు. శనివారం ఆటపాటలతో వేడుకలు నిర్వహించారు. అనంతరం బొడ్డెమ్మ నోము నోముకుని ప్రత్యేకపూజలు చేశారు. తమ పిల్లాపాపలు, పెద్దలు చల్లంగా ఉండాలని వేడుకున్నారు. అనంతరం స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. పద్మలత, శోభారాణి, విజయలక్ష్మి, మంజుల, అరుణ, జ్యోతిలక్ష్మి, రాధ, శరణ్య, శిరీష, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నారదాసుకు ఘనస్వాగతం

గోదావరిఖని: రామగుండం బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు శనివారం గోదావరిఖని చేరుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే చందర్ ఆయనను శాలువాతో సన్మానించారు. ఆయన వెంట డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, పలువురు నాయకులు ఉన్నారు.



పెద్దపల్లిలో బతుకమ్మ పేర్చుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి



బతుకమ్మ ఆడుతున్న మహిళలు, యువతులు



బతుకమ్మలతో తరలివెళ్తూ..



బతుకమ్మతో మహిళ

ఎంగిలిపూల సంబురం





జ్యోతినగర్‌లో..



గోదావరిఖనిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, యువతులు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా.. ఆడపడుచులు సంబురంగా జరుపుకునే బతుకమ్మ వేడుకల్లో రెండోఘట్టం శనివారం ప్రారంభమైంది. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను ప్రధాన కూడళ్ల వద్దకు తీసుకొచ్చిన మహిళలు.. సంప్రదాయ ఆటాపాటలతో నృత్యం చేస్తూ వేడుకలు జరుపుకున్నారు. బతుకమ్మల చుట్టూ లయబద్ధంగా తిరుగుతూ పాటలు పాడారు. ఆటలు ఆడారు. గోదావరిఖని, పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్‌తోపాటు అన్ని గ్రామాల్లోనూ వేడుకలు అంబరాన్నంటాయి. సంబురాల అనంతరం సమీప జలవనరుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేసిన మహిళలు.. ఆ తర్వాత వివిధ రకాల పిండివంటలు, సత్తులతో వాయినాలు ఇచ్చుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెట్‌వర్క్



దారులన్నీ తెలంగాణ భవన్‌కే..

జంగ్ తెలంగాణ

- నేడు బీ ఫారాలు అందుకోనున్న 'కారు' పార్టీ అభ్యర్థులు
- విజయంపై ధీమాతో రాజధానికి ప్రయాణం
- మూడోసారి అందుకునే వారే అధికం..

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఎన్నికల పరుగుపందెంలో ముందంజలో ఉన్న అధికార బీఆర్‌ఎస్ పార్టీ.. బరిలో నిలిచే అభ్యర్థులకు ఆదివారం బీ ఫారాలు అందించనుంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా నుంచి అసెంబ్లీ బరిలోకి దిగనున్న అభ్యర్థులంతా ఉదయం 9గంటల వరకు తెలంగాణ భవన్‌కు చేరుకోనున్నారు. అక్కడ 11 గంటలకు సీఎం చేతుల మీదుగా బీ ఫారాలు అందుకోనున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలు, కొత్త అభ్యర్థులతో పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ కాసేపు మాట్లాడుతారు. భోజనం అనంతరం వారంతా తిరుగుముఖం పడతారు. హుస్నాబాద్‌లో సభా ఏర్పాట్ల నేపథ్యంలో కరీంనగర్, సిద్దిపేట, హుస్నాబాద్ నేతలు కాస్త ముందుగానే బయల్దేరుతారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లా నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ఆశావహులు చాలామంది రాజధానికి చేరుకున్నారని సమాచారం. వీరిలో ముగ్గురు తొలిసారి, ఇద్దరు రెండోసారి, ఆరుగురు మూడోసారి, ఒకరు ఐదోసారి, మరొకరు ఏడోసారి బీ ఫారాలు అందుకోనుండడం గమనార్హం.

ఈ దఫాతో ఎవరెన్నిసార్లంటే..


- కొప్పుల ఈశ్వర్, ధర్మపురి: ఏడుసార్లు (2004, 2008, 2009, 2010, 2014, 2018, 2023)
- కేటీఆర్, సిరిసిల్ల: ఐదుసార్లు (2009, 2010, 2014, 2018, 2023)
- గంగుల కమలాకర్, కరీంనగర్: మూడుసార్లు (2014, 2018, 2023)
- పుట్ట మధు, మంథని: మూడుసార్లు (2014, 2018, 2023)
- దాసరి మనోహర్‌రెడ్డి, పెద్దపల్లి: మూడుసార్లు (2014, 2018, 2023)
- రసమయి బాలకిషన్, మానకొండూరు: మూడుసార్లు (2014, 2018, 2023)
- వొడితెల సతీశ్‌బాబు, హుస్నాబాద్: మూడుసార్లు (2014, 2018, 2023)
- డాక్టర్ సంజయ్, జగిత్యాల: మూడుసార్లు (2014, 2018, 2023)
- సుంకె రవిశంకర్, చొప్పదండి: రెండుసార్లు (2018, 2023)
- కోరుకంటి చందర్, రామగుండం: రెండుసార్లు (2009, 2023)

తొలిసారి అందుకునేవారిలో

- డాక్టర్. కె.సంజయ్ (కోరుట్ల) : తొలిసారి
- పాడి కౌశిక్‌రెడ్డి (హుజూరాబాద్): తొలిసారి
- సీహెచ్ లక్ష్మీనరసింహారావు (వేములవాడ): తొలిసారి

విజయంపై ధీమా..

పదేళ్లుగా పార్టీ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులే తమను తిరిగి గెలిపిస్తాయని గులాబీ పార్టీ నేతలు ధీమాగా ఉన్నారు. 2018 ముందస్తు అసెంబ్లీ ఎన్నికల్లో గెలుచుకున్న 88 సీట్లకు మించి ఈసారి విజయం సాధిస్తామంటున్నారు. గత రెండు ఎన్నికల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 12 స్థానాల్లో జయకేతనం ఎగురవేస్తూ వచ్చిన తాము.. ఈసారి 13కు 13 సీట్లు గెలిచి తీరుతామని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. శనివారంతో అమావాస్య ముగియనుంది. ఈ నేపథ్యంలో హుస్నాబాద్ సభతో పార్టీ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్ ఎన్నికల ప్రచారానికి సమరశంఖం పూరించనున్నారు. ఆ వెంటనే బీ ఫారాలు అందుకున్న అభ్యర్థులంతా ప్రచారాన్ని మరింత ముమ్మరం చేయనున్నారు. చాలామంది నాయకులు ఎన్నికల ప్రచార రథాలను ఇప్పటికే సిద్ధం చేసుకున్నారు.



మరింత అభివృద్ధి చేస్తా..



నాకు 2009లోనే మొదటిసారి పార్టీ బీఫాం ఇచ్చింది. ఈసారి సీఎం కేసీఆర్ చేతుల మీదుగా బీఫాం తీసుకోబోతున్న క్షణం కోసం ఎదురుచూస్తున్నా. ఉద్యమ నేపథ్యం నుంచి ఎదిగిన నాకు పార్టీ జిల్లా అధ్యక్షుడిగా చేసే అవకాశం వచ్చింది. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో రామగుండాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దాం. ప్రజల ఆశీర్వాదంతో మరోసారి గెలిచి మరింత అభివృద్ధి చేస్తా.

– కోరుకంటి చందర్, ఎమ్మెల్యే, రామగుండం

సేవ చేసే అవకాశమివ్వండి



మంథని నియోజకవర్గ ప్రజలకు సేవచేసే అవకాశం కల్పించండి. 60 ఏళ్లలోకాని అభివృద్ధిని బీఆర్‌ఎస్ పదేళ్లలో చేసి చూపించింది. మారుమూల ప్రాంతాలకు రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణం పెద్ద ఎత్తున జరిగాయి. కాళేశ్వరం ప్రాజెక్టుతో గోదావరితీరం మరో కోనసీమగా మారింది. ప్రజల ఆశీర్వాదంతో మళ్లీ ఎమ్మెల్యేగా గెలిచి సేవ చేస్తా.

– పుట్ట మధూకర్, ఎమ్మెల్యే అభ్యర్థి, మంథని

హ్యాట్రిక్ సాధిస్తా..



ఈప్రాంత ప్రజల ఆశీస్సులతో రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందా. నన్ను నమ్మి మరోసారి బీఫారం అందించడం ఆనందంగా ఉంది. హ్యాట్రిక్ విజయం సాధించి కేసీఆర్‌కు బహుమతిగా ఇస్తా. పదేళ్లలో పెద్దపల్లి నియోజకవర్గం అభివృద్ధిలో అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిచింది. ఎన్నికల సమయంలో వచ్చే నాయకుల మాటలు నమ్మకుండా అభివృద్ధిని చూసి ఓటేయాలని ప్రజలను కోరుతున్నా.

– దాసరి మనోహర్‌రెడ్డి, పెద్దపల్లి ఎమ్మెల్యే

రిటర్నింగ్, నోడల్ అధికారులు వీరే..

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్, నోడల్ అధికారులను నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. జిల్లాలో పెద్దపల్లి, రామగుండం, మంథని అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ నియోజకవర్గాలకు రిటర్నింగ్ అధికారులను నియమించారు. అలాగే నియామవళిని కచ్చితంగా అమలయ్యేలా పర్యవేక్షించేందుకు, నిబంధనలు ఉల్లంఘించిన వారిని గుర్తించి, నోటీసులు జారీచేసేందుకు నోడల్ అధికారులను నియమించారు. ఇప్పటికే అనుమతి లేకుండా గోడలపై రాతలు రాసిన నాయకులకు నోటీసులు జారీచేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

నియోజకవర్గం	రిటర్నింగ్ అధికారి	సెల్ నంబరు
పెద్దపల్లి	మధుమోహన్, ఆర్డీవో	79950 70704
మంథని	హనుమానాయక్, ఆర్డీవో	79950 70705
రామగుండం	అరుణశ్రీ, ఏడీసీ	79950 70714
నోడల్ అధికారి	**బాధ్యతలు**	**సెల్ నంబరు**
ఆదిరెడ్డి	సిబ్బందికి శిక్షణ	72888 94479
మాధవి	సిబ్బంది కేటాయింపు	97040 57660
రవీందర్	సామగ్రి, ప్లానింగ్	78421 40726
భీంసింగ్	రవాణా	88976 44207
మధుసూదనాచారి	సైబర్ సెక్యూరిటీ	98494 77757
రవుఫ్‌ఖాన్	ఈవీఎంపై అవగాహన, దివ్యాంగ ఓటరు సౌకర్యం	96184 04384
శ్రీధర్	ఈవీఎం మేనేజ్‌మెంట్	91107 21333
శ్రీనివాస్	ప్రవర్తనా నియమావళి	94402 13271
శ్రీమాల	వ్యయం, పరిశీలన	91001 15664
చంద్రమౌళి	బ్యాలెట్ పేపర్, ఓటరు లిస్టు	99634 70754
అయూబ్‌ఖాన్	మీడియా	99493 51666
శ్రీనివాసులు	హెల్ప్‌లైన్, ఫిర్యాదులు	99855 42624
శివయ్య	పరిశీలకుడు	94408 10354

బ్రిడ్జి పోటీలు ప్రారంభం



తలపడుతున్న క్రీడాకారులు

పెద్దపల్లిరూరల్: స్థానిక రిక్రియేషన్ క్లబ్‌లో శనివారం బ్రిడ్జి పోటీలు ప్రారంభమయ్యాయి. రెండురోజుల పాటు పోటీలు నిర్వహిస్తారు. ఇందుకోసం సుమారు 16 టేబుళ్లు అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రముఖ వ్యాపారవేత్త శంకర్‌లాల్ జకోటియా స్మారకంగా నిర్వహిస్తున్న బ్రిడ్జి పోటీలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల నుంచి సుమారు 200మందికిపైగా క్రీడాకారులు హాజరయ్యారు. ఓపెన్ బ్రిడ్జి చాంపియన్‌షిప్ పోటీలను జిల్లా కేంద్రంలో ఏటా నిర్వహించడం ఆనవాయితీ. పోటీలను ప్రారంభించాక మున్సిపల్ మాజీ చైర్మన్ ఎల్.రాజయ్య, క్లబ్ ప్రధాన కార్యదర్శి కొట్టె సదానందం మాట్లాడుతూ మేధాశక్తిని పెంచేందుకు బ్రిడ్జి పోటీలు దోహదపడతాయన్నారు. వ్యాపారవేత్తలు ఓంప్రకాశ్ జకోటియా, దేవసాని ధర్మయ్య, తొడుపునూరి కృష్ణమూర్తి పాల్గొన్నారు. కాగా, పోటీలకు డీజీపీస్థాయి అధికారులు హాజరైనట్లు తెలిసింది.

పదేళ్లలో ఎంతోప్రగతి సాధించాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్

- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని: సీఎం కేసీఆర్ హయాంలో గత పదేళ్లలో రాష్ట్రం వందేళ్ల ప్రగతి సాధించిందని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. శనివారం స్థానిక 31వ డివిజన్‌లో ప్రజాఅంకిత యాత్ర నిర్వహించారు. 60ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ప్రజల బతుకులు ఆగమయ్యాయని విమర్శించారు. సీఎం కేసీఆర్‌ను ఒప్పించి, మెప్పించి మెడికల్ కాలేజీ మంజూరు చేయించానని అన్నారు. నగర మేయర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, నాయకులు అడ్డాల స్వరూప, రామస్వామి, అడ్డాల గట్టయ్య, బాల రాజ్‌కుమార్, కౌశిక హరి, మాదాసు రామ్మూర్తి, నారాయణదాసు మారుతి, జేవీ రాజు, రాకం వేణు, కాల్వ శ్రీనివాస్, పీచర శ్రీనివాస్, మెతుకు దేవరాజ్, రమేశ్‌గౌడ్, జాహీద్‌పాషా పాల్గొన్నారు.

చివరిశ్వాస వరకూ ప్రజాసేవలోనే ఉంటా



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాకూర్

- డీసీసీ అధ్యక్షుడు రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: తన చివరిశ్వాస వరకూ ప్రజాసేవలో ఉంటానని డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అన్నారు. శనివారం పలువురు కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రూ.500కే వంటగ్యాస్ అందిస్తామని, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ప్రతీ గృహిణికి రూ.2,500 మహాలక్ష్మి పథకం ద్వారా అందిస్తామని, రైతులకు ఒకేసారి రూ. 2లక్షల రుణమాఫీ చేస్తామని, విద్యార్థులకు రూ.5లక్షల విద్యా భరోసాకార్డు సౌకర్యం కల్పిస్తామని, చేయూత పింఛన్ రూ.4వేలు అందిస్తామని చెప్పారు. రామగుండంలో కాంగ్రెస్ జెండా ఎగురవేయడానికి అందరూ కృషి చేయాలని కోరారు. నాయకులు మహంకాళి స్వామి, ముస్తాఫా, చుక్కల శ్రీనివాస్, గట్ల రమేశ్, నజీముద్దీన్, కౌటం సతీశ్, శివ, సతీశ్, అరుణ్ ఉన్నారు.

క్లుప్తంగా

చెట్టుకు పోస్టుబాక్స్



వేపచెట్టుకు తగిలించిన పోస్టుబాక్సు

రామగుండం: నేటి డిజిటల్ యుగంలో ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ ఆన్‌లైన్, మెయిల్స్, ఫ్యాక్స్ తదితర ప్రసార మాధ్యమాల ద్వారానే సాగుతున్నాయి. అయితే, అంతర్గాం మండలం గోలివాడ గ్రామ ప్రధాన కూడలిలో పోస్టు బాక్సును ఇలా చెట్టుకు తగిలించి ఉంచడంపై యువత ఆసక్తిగా తిలకిస్తోంది. పోస్టు ద్వారా కేవలం ఏటీఎంలు, పాన్‌కార్డులు, ఇతర కొన్ని ధ్రువీకరణపత్రాలు మాత్రమే బట్వాడా అవుతున్నాయి. దీంతో వీటి వినియోగం పెద్దగా లేదు. కానీ, గోలివాడలోని పోస్టుబాక్సు ఇలా ఇంకా ఆకర్షిస్తూ పాతజ్ఞాపకాలను గుర్తుచేస్తోంది.

యువతకు అవకాశం ఇవ్వండి



లక్ష్మణ్‌తో దేవేందర్

పెద్దపల్లిరూరల్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో యువత పోటీచేసేలా అవకాశం ఇవ్వాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బద్రి దేవేందర్ కోరారు. హైదరాబాద్‌లో శనివారం బీజేపీ ఓబీసీ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్‌ను ఆయన కలిశారు. జిల్లాలోని రామగుండం అసెంబ్లీ స్థానం నుంచి పోటీచేసే అవకాశాన్ని తనకు ఇప్పించేలా చూడాలని లక్ష్మణ్‌కు విన్నవించారు. ఆయన వెంట వక్ఫ్‌బోర్డు మాజీ సభ్యుడు సయ్యద్ ఫయాజ్ ఉన్నారు.

రూ.10లక్షలు అప్పుచేసి.. కూతురు పెళ్లిచేసి..

- అప్పుతీర్చే దారిలేక మహిళ ఆత్మహత్య

ఓదెల(పెద్దపల్లి): తన కూతురి వివాహం చేసేందుకు తెలిసినవారి వద్ద సుమారు రూ.10లక్షల వరకు అప్పుచేసిన ఆ తల్లి.. ఆ అప్పు తీర్చే దారిలేక మనస్తాపంతో ఆత్మహత్య చేసుకుంది. ఈ విషాద సంఘటన పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధి గుండ్లపల్లె గ్రామంలో చోటుచేసుకుంది. పొత్కపల్లి ఎస్సై శ్రీధర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అనిరెడ్డి స్వప్న(45) – శ్రీనివాసరెడ్డి దంపతులు. వీరికి ఒక కొడుకు, ఒక కూతురు ఉన్నారు. దాదాపు ఏడాది క్రితం కూతురు వివాహం చేశారు. ఇందుకోసం సుమారు రూ.10లక్షల వరకు అప్పు అయ్యింది. మరోవైపు.. తమకు ఉన్న కొద్దిపాటి వ్యవసాయ భూమిలో పంటలు అంతంత మాత్రమే పండుతున్నాయి. దీంతో చేసిన అప్పులు ఎలా తీర్చేదనే మనస్తాపంతో స్వప్న కొద్దిరోజులుగా ముదావహంతో ఉంటోంది. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది ఈనెల 13 తన ఇంట్లో గడ్డిమందు తాగింది. కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. మృతురాలి సోదరుడు అబ్బిడి రాజిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

జగజ్జనని.. శక్తి స్వరూపిణి

- నేటి నుంచి దేవి నవరాత్రోత్సవాలు
- వేడుకలకు సిద్ధమైన మండపాలు



కరీంనగర్‌కల్చరల్: అమ్మలగన్న అమ్మ.. ముగ్గురమ్మల మూలపుటమ్మ.. త్రిశక్తి స్వరూపిణి.. సకల జగత్తుకు మూలం, త్రిమూర్తులకు శక్తి ప్రదాత, త్రిలోకేశ్వరీ సకలాభీష్ట ప్రదాయిని అయిన దేవి నవరాత్రోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమవుతాయి. అశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి ప్రారంభమయ్యే నవరాత్రుల్లో తొలిరోజు అమ్మవారిని కలశస్థాపనం చేసి ప్రతిష్ఠిస్తారు. అప్పటి నుంచి విజయదశమి వరకు దేవీనవరాత్రులు నిర్వహిస్తారు.

తొమ్మిది అవతారాలు

శక్తి స్వరూపిణి, ఆది పరాశక్తి అయిన దుర్గామాతను శైలపుత్రి, బ్రహ్మచారిణి, చంద్రఘంట, కూష్మాండ, స్కంధమాత, కాత్యాయణి, కాళరాత్రి, మహాగౌరి, సిద్ధిరాత్రి తొమ్మిది అవతారాల్లో భక్తులు కొలుస్తారు.

ప్రీతిపాత్రమైన రోజులు

రుద్ర రూపిణి భద్రకాళిగా ఎనిమిదవ రోజు జన్మించిన చాముండి తొమ్మిదవ రోజు వీరవిహారం చేసి దైత్య సంహారం చేసిందని పురాణాలు చెబుతున్నాయి. పదో రోజు విజయలక్ష్మీగా జనుల ఆనందోత్సవాలకు ప్రతీకగా పూజలందుకుంటుంది. నవరాత్రుల్లో చివరి మూడురోజులు అత్యంత ప్రీతిపాత్రమైనవి. వీటినే మనం దుర్గాష్టమి, మహార్నవమి, విజయదశమి పేరిట ఉత్సవాలు జరుపుకుంటాం. రోజుకో రూపంలో అమ్మవారు దర్శనం ఇస్తారు.

శైలపుత్రి

చైతన్యశక్తి శైలపుత్రి, త్రిమూర్తి స్వరూపిణి ఆది పరాశక్తి సతీదేవిగా యోగాగ్నిలో తనువు చాలించింది. తిరిగి మీనా హిమవంతులకు శైలపుత్రీదేవిగా జన్మించింది. నందివాహనంపై త్రిశూల ధారిణిగా స్త్రీ శక్తిని లోకానికి తెలియజేసింది.

బ్రహ్మచారిణి

సంకల్పబలం బ్రహ్మచారిణి. బ్రహ్మచారినిగా నియమనిష్ఠలతో తపస్సు చేసి శివుడిని వరించింది. చేతిలో కమండలంతో మాలధారిణిగా నిత్య తపో ముద్రాంకితగా దర్శనమిస్తుంది. ఈ రూపంలోని దుర్గాను ఆరాధించినవారికి ఏకాగ్రత దీక్ష అలవడుతుంది.

చంద్రఘంటాదేవి

మనసుకు మార్గదర్శి చంద్రఘంటాదేవి. ఈ రూపంలో అమ్మవారిని ఆరాధించేవారికి శాంతి, సౌభాగ్యాలు కలుగుతాయని ప్రతీతి.

కుష్మాండ దుర్గ

సర్వ దుఃఖహారిణి కుష్మాండదుర్గ. శారీరక, మానసిక రుగ్మతలను పారదోలే రూపం కుష్మాండదుర్గ. వర, అంకుశ, పాశ, అభయ ముద్రలతో కూడిన అష్ట భుజాలతో కోటి సూర్యప్రభలతో ప్రకాశించే జనని అభయ ప్రదాయిని.

స్కంధమాత

మాతృదేవోభవ అనే సందేశాన్ని, అమ్మతత్వాన్ని మానవాళికి ప్రబోధంగా, మాతలకే మాతా అయి శ్వేత వర్ణశోభితగా, ఆదిమాతగా కుమార స్వామిని లాలించే అమ్మ రూపంలో వెలుగొందే దివ్యమూర్తి.

జ్ఞానశక్తి కాత్యాయనీదేవి

సృష్టి, స్థితి, లయలకు హేతువైన శక్తి. సకల సంసార బంధాలకు కారుకురాలు. భవసాగరాల నుంచి మానవుల్ని ఉద్ధరించే శక్తి. సింహ వాహనం అధిరోహించి కరవాలం చేబుని రాక్షసత్వాన్ని పారదోలే జగద్రక్షిణిగా శోభిల్లుతుంది.

కాళరాత్రి

ప్రాణికోటి జీవితాల్లోని గ్రహబాధలు తొలగించి మృత్యువుకే భయం కలిగిస్తూ దుర్గుణాలు, దుష్ట శక్తులను పారదోలి సత్యకర్మల్ని ప్రేరేపిస్తూ మంచి బుద్ధిని పెంచుతుంది.

మహాగౌరీ

మంగళ స్వరూపిణి మహాగౌరి. ఆదిపరాశక్తి భయంకర కాళ స్వరూపాన్ని విసర్జించిన అమ్మవారు ధవళకాంతితో వెలిగిపోయే మంగళ స్వరూపిణిగా మహాగౌరి అవతరించింది. తెల్లని వస్త్రాలు ధరించి, త్రిశూలం చేబూని శతకోటి దివ్యకాంతుల్ని భక్తజనకోటికి అభయ ప్రదానం చేస్తూ శోభిల్లుతుంది.

సిద్ధిధాత్రీ

మోక్షప్రదాత్రి సిద్ధిధాత్రీ. భౌతిక జీవనంలో సర్వ సిద్ధులూ అనుగ్రహించే సిద్ధిధాత్రి అద్వైత సిద్ధికి ప్రేరణనిస్తుంది. అష్ట సిద్ధులను మోక్షమును ప్రసాదిస్తుంది.

అపరాజిత

అపరాజిత శ్రీరాజేశ్వరీదేవి. సర్వమానవ జీవితాల్లో సర్వశక్తికి కేంద్రస్థానం జగజ్జననే. శరన్నవరాత్రుల్లో అమ్మవారికి విశేష అలంకారాలు ముగిశాక విజయదశమి రోజు శ్రీరాజరాజేశ్వరిగా దర్శనమిస్తుంది.

ముస్లిం పక్షపాతి ఎమ్మెల్యే చందర్



మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: ముస్లింల సంక్షేమానికి అహర్నిశలు పనిచేస్తున్న ఎమ్మెల్యే చందర్‌ను విమర్శించే అర్హత కాంగ్రెస్ నాయకులకు లేదని బీఆర్ఎస్ అధికార ప్రతినిధి, మైనార్టీ నాయకుడు జాహిద్‌పాషా అన్నారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని అన్నిమసీదుల అభివృద్ధి కోసం రూ.లక్షలు కేటాయించారన్నారు. పదిమంది నిరుపేద ముస్లింలకు కొత్త ఇళ్లు నిర్మించి ఇచ్చారని గుర్తుచేశారు. అన్నిఈద్గాల్లో బోర్‌వెల్‌లు వేయించారన్నారు. రూ.20లక్షలతో ఫ్లోరింగ్ మంజూరు చేయించారని తెలిపారు. పొట్యాల మసీదుకు రూ.15లక్షలు మంజూరు చేశారన్నారు. ఇలా అభివృద్ధి పనులు చేస్తున్న ఎమ్మెల్యేపై కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేయడం సరికాదన్నారు. ముస్లింలకు ఏంచేశారని ఓట్లు అడుగుతున్నావని రాజ్‌ఠాకూర్‌ను ఆయన ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు ఎండీ సర్వర్, గౌస్‌పాషా, ఎంఏ హమీద్, సత్తార్‌ఖాన్, మొహ్మద్ సాజిద్, మున్వర్ తదితరులు పాల్గొన్నారు.

స్క్రాప్ పట్టివేత

గోదావరిఖని: ఆర్జీ–1 పరిధిలోని పాత వీటీసీ సమీపంలో ఐరన్‌స్క్రాప్ తరలిస్తుండగా ఏసీటీఎస్ టీం శనివారం పట్టుకుంది. విశ్వసనీయ సమాచారం మేరకు.. వీటీసీ ప్రాంతానికి వచ్చిన దొంగలను వెంబండించే ప్రయత్నం చేయగా స్క్రాప్ పడేసి దొంగలు పరారయ్యారు. పట్టుకున్న స్క్రాప్ 610కిలోలు ఉంటుందని జూనియర్ ఇన్‌స్పెక్టర్ ఉమేశ్ తెలిపారు.

అవకాశం ఇస్తే పోటీచేస్తా



విన్నవిస్తున్న ముస్తాక్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి అసెంబ్లీ స్థానం నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ తెలంగాణ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని స్థానికుడు మహమ్మద్ అబ్దుల్ ముస్తాక్ తెలిపారు. హైదరాబాద్‌లోని వైఎస్సార్ టీపీ కార్యాలయంలో శనివారం పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి లింగారెడ్డి, ఆదిలాబాద్ ఇన్‌చార్జి అనిల్‌యాదవ్‌ను కలిసి విన్నవించినట్లు పేర్కొన్నారు. గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ టికెట్‌పై పెద్దపల్లి నుంచి పోటీ చేశానని గుర్తుచేశారు. ఈసారి అవకాశం ఇస్తే తాను పోటీకి సిద్ధంగా ఉన్నానని వివరించారు. ఆయన వెంట మంజూర్‌బేగ్ ఉన్నారు.

బొగ్గు బాయి

తొత్తుసంఘాలకు బుద్ధిచెప్పాలి



మాట్లాడుతున్న సీతారామయ్య

గోదావరిఖని: గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో తొత్తుసంఘాలకు బుద్ధిచెప్పాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య కోరారు. శనివారం జీడీకే–2వ గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణి మనుగడ, కార్మికుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడుతున్న చారిత్రక యూనియన్ ఏఐటీయూసీ అని అన్నారు. సింగరేణికి చెందిన రూ.వేల కోట్లు దారిమళ్లించి ఇతరచోట్ల అభివృద్ధి పేరిట ఖర్చు చేయడం సరైందికాదన్నారు. సంస్థలో ఏటా లాభాలు పెరుగుతున్నా కార్మికులు, ఉద్యోగులకు వేతనాలు చెల్లించడానికి సర్దుబాటుకాని పరిస్థితి దాపురించిందన్నారు. కార్మిక కుటుంబాలకు గృహ, విద్య, వైద్యం కోసం వెచ్చించకుండా ప్రజాప్రతినిధులు, వరద బాధితులు, జాతరలు, మెడికల్ కాలేజీలకు కంపెనీ సొమ్ము ధారపోస్తున్నారని విమర్శించారు. రాష్ట్రప్రభుత్వం సింగరేణికి బాకీపడిన రూ.29వేల కోట్లను చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. 11వ వేజ్‌బోర్డులో మంచి వేతనాలు సాధించి ఎరియర్స్ కూడా ఒకేసారి చెల్లించేలా ఏఐటీయూసీ పోరాటం చేసిందన్నారు. అధికారుల జీతాలు కార్మికుల కంటే తక్కువగా ఉన్నాయని వారు జబల్పూర్ హైకోర్టులో కేసు వేస్తే కోల్‌ఇండియాలో వేతనాలు ఆగినా సింగరేణిలో ఆపకుండా తీసుకోగలిగామని ఆయన పేర్కొన్నారు. అవసరమైతే ఈ సమస్యపైన ఇంకేమైనా మెలిక పెడితే సింగరేణిలో కూడా సమ్మెకు వెనుకాడబోమని హెచ్చరించారు. ఈసందర్భంగా పలువురు యూనియన్‌లో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. నాయకులు కె.స్వామి, ఆరెల్లి పోశం, రంగు శ్రీనివాస్, పర్లపెల్లి రామస్వామి, ఎంఏ గౌస్, వెంకట్‌రెడ్డి, మిట్ట శంకర్ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల కోసం నిరంతర పోరు



మాట్లాడుతున్న తుమ్మల రాజారెడ్డి

గోదావరిఖని: సింగరేణి కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాటం చేస్తున్నామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. శనివారం జీడీకే–1, 3 గనులపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. డిసెంబర్ 27న సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహిస్తున్న క్రమంలో కార్మికులు చైతన్యంతో ముందుకు సాగాలన్నారు. సింగరేణి సంస్థ ఆస్తులను కొల్లగొడుతూ పరిశ్రమను గుత్తాదారులు, పెట్టుబడుదారులకు విక్రయించాలని చూస్తున్న బీఆర్ఎస్, బీజేపీల ఉనికి లేకుండా చేయాలని ఆయన కోరారు. తెలంగాణ అభివృద్ధి పేరుతో సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కార్మికుల కష్టార్జితం రూ.30 వేల కోట్లను సంస్థకు చెల్లించకుండా అప్పులపాలు చేస్తున్న రాష్ట్రప్రభుత్వ వైఖరిని ఎండగట్టాలని అన్నారు. రాబోయే గుర్తింపు సంఘం ఎన్నికల్లో సీఐటీయూను గెలిపించాలని ఆయన కోరారు. నాయకులు మేదరి సారయ్య, మెండె శ్రీనివాస్, తోట నరహరిరావు, ఎస్కే గౌస్, పి.శ్రీనివాస్‌రావు, శివరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.అశోక్ డిమాండ్ చేశారు. శనివారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ ఐదో జోన్ సెక్షన్ తోటమాలి కార్మికులతో కలిసి నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సింగరేణిలో దాదాపు 30 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారన్నారు. వారికి కనీస వేతనాలు చెల్లించాలని కోరారు. 22వ జీవోను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో కార్మికులు బుచ్చమ్మ, రాజనర్సు, లక్ష్మి, పద్మ, చలపతి నాయక్, ఎల్లక్క, రమేశ్, వెంకటస్వామి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

లాభాల వాటాపై ‘కోడ్’ ఎఫెక్ట్

- దసరా అడ్వాన్స్ చెల్లింపులపైనా ప్రభావం
- ఎన్నికల సంఘానికి లేఖ రాసిన సింగరేణి యాజమాన్యం

గోదావరిఖని: సింగరేణి కార్మికులకు రావాల్సిన లాభాల వాటా చెల్లింపులకు ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎన్నికల కమిషన్ అనుమతి ఇస్తే తప్ప కార్మికుల బ్యాంకు ఖాతాల్లో వాటా జమఅయ్యే అవకాశాలు లేవు. అయితే, వాటా చెల్లించుందకు అవసరమైన మార్గాలను యాజమాన్యం అన్వేషిస్తోంది. 2021–22 ఆర్థిక సంవత్సరంలో రూ.33,065కోట్ల టర్నోవర్ సాధించి రూ.2,222కోట్లు నికర లాభాన్ని సింగరేణి ఆర్జించింది. ఇందులో కార్మికుల వాటా 32శాతం చెల్లించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఇప్పటికే ఆదేశాలు జారీచేశారు. దీంతో రూ.2,222కోట్లలో 32శాతం కార్మికుల వాటాగా రూ.711కోట్లను ఈనెల 16న చెల్లించాలని యాజమాన్యం ఈనెల 4న ఆదేశాలు జారీచేసింది. అలాగే దసరా పండుగ అడ్వాన్స్‌గా ఒక్కో కార్మికుడికి రూ.25వేలను ఈనెల 20న చెల్లించాల్సి ఉంది. అయితే నగదు భారీస్థాయిలో చెల్లింపులు ఉండడం, రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో ఈసారి చెల్లింపులపై యాజమాన్యం మల్లగుల్లాలు పడుతున్నట్లు తెలుస్తోంది.

ఎన్నికల కమిషన్ వద్దకు యాజమాన్యం..

లాభాలా వాటా, దసరా అడ్వాన్ సొమ్మును కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమచేయాల్సి ఉండటంతో సింగరేణి యాజమాన్యం ఈమేరకు ఏర్పాట్లు చేసింది. ఈలోగా ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఈనెల 16న కార్మికుల బ్యాంకుల ఖాతాల్లో జమకావాల్సిన సొమ్ము నిలిచిపోయే అవకాశాలు ఉన్నాయి. అలాగే దసరా పండుగ అడ్వాన్ కూడా ఎన్నికల కమిషన్ అనుమతిలేకుండా ఇవ్వడం సాధ్యపడని పరిస్థితి. ఈక్రమంలో యాజమాన్యం రాష్ట్ర ఎన్నికల కమిషన్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లినట్లు సమాచారం. ఎన్నికల కమిషన్ గ్రీన్‌సిగ్నల్ ఇస్తే కార్మికులకు ఖాతాలో వీటిని జమచేసేలా ఏర్పాట్లు చేశారు. అయితే ఎన్నికల కమిషన్ ఏవిధంగా స్పందిస్తుందో వేచి చూడాల్సిందే.

సొమ్ము ఆపితే ఊరుకోం

సింగరేణి కార్మికుల లాభాల వాటా చెల్లింపు ఈనెల 4న ప్రకటించారు. ఎన్నికల కోడ్ ఈనెల 9న వచ్చింది. అంతేకాకుండా ఏటా లాభాల వాటా చెల్లింపు క్రమంగా జరిగే ప్రక్రియ. ఈక్రమంలో లాభాల వాటా, పండుగ అడ్వాన్స్ ఆపితే సంస్థ వ్యాప్తంగా ఆందోళనలు, ధర్నాలు చేస్తాం. కావాలనే యాజమాన్యం కాలయాపన చేయాలని చూస్తోంది.

– వాసిరెడ్డి సీతారామయ్య, అధ్యక్షుడు, ఏఐటీయూసీ

పండుగపూట విషాదం

- బైక్ అదుపుతప్పి ఆశవర్కర్ మృతి
- పరామర్శకు వచ్చి ప్రాణాలు కోల్పోయిన సులోచన



సులోచన(ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): అనారోగ్యంతో ఉన్న అల్లుడిని పరామర్శించేందుకు వచ్చిన మహిళ రోడ్డు ప్రమాదంలో అసువులు బాసింది. బైక్ అదుపుతప్పి కింద పడిపోగా.. తీవ్ర గాయాలతో దుర్మరణం చెందింది. ఎస్సై శేఖర్ తెలిపిన వివరాలు. సిద్దిపేట జిల్లా జక్కాపూర్‌కు చెందిన ఆశవర్కర్ కోల సులోచన(49)–రాజారాం దంపతుల కూతురు రేఖను మండలంలోని గూడెంకు చెందిన యువకుడికి ఇచ్చి వివాహం చేశారు. ఇటీవల అల్లుడికి ఆపరేషన్ కావడంతో పరామర్శించేందుకు శుక్రవారం వచ్చి, రాత్రి అక్కడే ఉన్నారు. శనివారం ఉదయమే జక్కాపూర్‌కు బైక్‌పై బయలుదేరారు. ముస్తాబాద్ నుంచి తెర్లుమద్ది వరకు ఉన్న బీటీ రహదారి పలుచోట్ల పనులు పూర్తికాక కంకర తేలింది. కంకర తేలిన రోడ్డుపై వెళ్తుండగా తెర్లుమద్ది శివారులో బైక్ అదుపుతప్పి కింద పడిపోయింది. ఈ సంఘటనలో సులోచన తలకు తీవ్ర గాయాలయ్యాయి. రక్తస్రావం అధికమవడంతో అక్కడికక్కడే మృతిచెందింది. జక్కాపూర్‌లో ఆశవర్కర్‌గా పనిచేస్తున్న సులోచన మృతితో కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. పండుగపూట జక్కాపూర్‌లో విషాదం అలుముకుంది. మృతురాలి కూతురు రేఖ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

‘అల్ఫోర్స్’లో అంబరాన్నంటిన సంబరాలు



బతుకమ్మ సంబురాల్లో అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి తదితరులు

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్‌లో అల్ఫోర్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. ‘అల్ఫోర్స్ డిలైట్–2023’ పేరిట జెన్‌నెక్స్ మైదానంలో శనివారం రాత్రి నిర్వహించిన వేడుకలను మంత్రి సతీమణి గంగుల రజిత, కలెక్టర్ సతీమణి పుష్పకుమారి, డాక్టర్ వి.వనజారెడ్డి, అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి గౌరమ్మపూజలో పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. విద్యా సంస్థల ఉపాధ్యాయినులు, సిబ్బందితో కలిసి బతుకమ్మ పాటలకు ఆటలాడుతూ ఉత్సాహంగా పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన వివిధ రకాల బతుకమ్మలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుంపులలో ఆభరణాలు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

ఓదెల(పెద్దపల్లి): జిల్లా సరిహద్దులోని గుంపుల శివారు చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎదులాపూర్ బిక్షపతి వద్ద రూ.5లక్షల విలువైన బంగారు, వెండి నగలు లభించాయి. వాటిని స్వాధీనం చేసుకున్నట్లు పొత్కపల్లి ఎస్సై శ్రీధర్ శనివారం తెలిపారు. కాల్వశ్రీరాంపూర్ నుంచి జమ్మికుంట వైపు కారులో వెళ్తుండగా రసీదు లేని బంగారు, వెండి ఆభరణాలు లభించాయని పేర్కొన్నారు. వీటిని స్వాధీనం చేసుకొని ఫ్లయింగ్ స్క్వాడ్స్‌కు అప్పగించినట్లు ఎస్సై వివరించారు.

నగదు పట్టివేత

రామగిరి: కల్వచర్లలో ఎస్సై రవి ప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం వాహనాలు తనిఖీ చేశారు. ఈసందర్భంగా కరీంనగర్‌కు చెందిన వ్యక్తి వద్ద రూ.1,28,000 నగదును స్వాధీనం చేసుకున్నారు. తగిన ఆధారాలు లేకపోవడంతో నగదు సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

పంచశీల జెండా ఆవిష్కరణ

యైటింక్లయిన్‌కాలనీ: బౌద్ధ సంఘం ఆధ్వర్యంలో రామగుండం కార్పొరేషన్ పోతనకాలనీలోని అంబేడ్కర్ విగ్రహానికి శనివారం ఆర్జీ–2 ఏరియా రెస్క్యూ జీఎం వెంకటేశ్వర్లు పంచశీల జెండా ఆవిష్కరించారు. బౌద్ధమతం సంఘం పెద్దపల్లి జిల్లా జనరల్ సెక్రటరీ రాజయ్య, సివిల్ సూపర్‌వైజర్ హరీశ్, శంకర్, అంకూస్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

ధర్మారం: కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ధర్మారం మండలం బంజేరుపల్లి గ్రామానికి చెందిన లావుడ్య రూప్లానాయక్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు మక్కాన్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. రూప్లానాయక్ నియామకంపై పార్టీ మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.



యైటింక్లయిన్‌కాలనీలో..



కాల్వశ్రీరాంపూర్‌లో..

ఉత్సాహంగా బతుకమ్మ వేడుకలు

యైటింక్లయిన్‌కాలనీ/కాల్వశ్రీరాంపూర్: యైటింక్లయిన్‌కాలనీ, కాల్వశ్రీరాంపూర్ ప్రాంతాల్లో శనివారం రాత్రి బతుమ్మ వేడుకలు వైభవంగా నిర్వహించారు. మహిళలు ఆటపాటలతో బతుకమ్మ ఆడారు.

దేవీ శరన్నవరాత్రులకు ముస్తాబు

మంథని: రాష్ట్రంలోనే ప్రసిద్ధిద్ధి చెందిన పురాతన ఆలయాల్లో పట్టణంలోని శ్రీమహాలక్ష్మీ ఆలయం ఒకటి. ఆదివారం నుంచి జరిపే దేవీ శరన్నవరాత్రోత్సవాలకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఈనెల 22వరకు ఉత్సవాలు జరుగుతాయి. అంఖడ దీపారాధనతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 21న చక్రి భజన, దుర్గా జననం, 22న అమ్మవారికి ప్రత్యేక భజన, పవళింపు సేవ, ఆశీర్వచన నిర్వహించనున్నారు. 9రోజుల పాటు నిరంతరాయంగా భజనలు కొనసాగడం అనేకఏళ్లు వస్తున్న ఆచారం. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకోవాలని ఆలయ కమిటీ చైర్మన్ మారుపాక చంద్రకళ, డైరెక్టర్లు పోతరాజు వెంకటలక్ష్మి, బత్తుల విజయలక్ష్మి, నీలం రమేశ్, కాయితోజు సమ్మయ్య, బడికెల శ్రీనివాస్, కొత్త బాలయ్య, ఎండోమెంట్ ఈవో రాజ్ కుమార్ కోరారు.